క్లుప్తంగా

ఘనంగా సంక్రాంతి సంబరాలు



కోరమండల్ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

కాకినాడ రూరల్: కోరమండల్ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వాకలపూడిలో సంక్రాంతి సంబరాలు ఆదివారం జరిగాయి. సంప్రదాయం ఉట్టిపడేలా ముగ్గులు పోటీలు, డూడూ బసవన్నల విన్యాసం, పలు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు కోరమండల్ కర్మాగారం కాకినాడ యూనిట్ మేనేజర్ శ్రీనివాసరావు, హెచ్ఆర్ మేనేజర్ పద్మనాభం చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కోరమండల్ మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు వెంకట దుర్గావతి, కార్యదర్శి మల్లిశ్వరి, కోశాధికారి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద పార్కులో 'చదవడం మాకిష్టం'



గాంధీనగర్ గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

బాలాజీచెరువు: స్థానిక వివేకానంద పార్క్‌లో గాంధీనగర్ శాఖ గ్రంథాలయంలో ఆదివారం 'చదవటం మాకిష్టం – సండే స్టోరీ టైం' కార్యక్రమాన్ని లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతో కథలను చదివించడం, చెప్పడం చేశారు. దీనికి హాజరైన విద్యార్థులతో రాయలసీమ జానపద హాస్య, జాతక కథలు అనే పుస్తకాలను చదివించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ శ్రీనివాసరావు విద్యార్థులు పాఠశాల పుస్తకాలతో పాటు గ్రంథాలయంలోని పుస్తకాలను చదవటం ద్వారా విజ్ఞానవంతులు కావచ్చని వివరించారు.

ఉత్సాహంగా క్రికెట్ టోర్నీ



కరపలో క్రికెట్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణ మూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ కరప (సీఏకే) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్–2025 జోరుగా సాగుతుంది. క్రికెట్ టోర్నీలో భాగంగా రెండో రోజు ఆదివారం ఏడు మ్యాచ్‌లు జరిగాయి. మొదటి మ్యాచ్‌లో కొత్తపేట–2 జట్టుపై పల్లపువీధి జట్టు 8 వికెట్ల తేడాతో, రెండో మ్యాచ్‌లో వేములవాడ జట్టుపై జె.భావారం జట్టు 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మూడో మ్యాచ్‌లో సీఏకే ఫ్రెండ్స్–11 జట్టుపై గేమ్‌చేంజర్ సీఏకే ఫ్రెండ్స్–11, నాలుగో మ్యాచ్‌లో ఏఆర్ అకాడమీ జట్టుపై సిరిపురం 4 వికెట్ల తేడాతో విజయకేతనం ఎగురవేసింది. ఐదో మ్యాచ్‌లో వలసపాకల జట్టుపై పల్లపువీధి కరప జట్టు 28 పరుగుల తేడాతో, ఆరోమ్యాచ్‌లో భావారం సూపర్ కింగ్స్ జట్టుపై మారి బాయ్స్‌జట్టు 66 పరుగుల తేడాతో గెలిచింది. ఏడో మ్యాచ్‌లో సీఏకే ఫ్రెండ్స్–11 జట్టు చేతిలో సిరిపురం జట్టు ఓటమిపాలైందని టోర్నీ నిర్వాహకులు నక్కా భీమ్, పోలిశెట్టి సునీల్, మేడిశెట్టి దుర్గాకిరణ్ తెలిపారు.

రేపు, ఎల్లుండి ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్

బాలాజీచెరువు (కాకినాడ): భారత వాతావరణ శాఖ (ఐఎండీ) 150 ఏళ్ల వేడుక సందర్భంగా ఈ నెల 14, 15 తేదీల్లో కాకినాడ పీఆర్ కళాశాల మాక్–క్లారెన్ మైదానం వద్ద ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్టు కాకినాడ వాతావరణ పరిశీలన కేంద్రం శాస్త్రవేత్త, ఆఫీసర్ డి.రాంబాబు ఆదివారం విలేకర్లకు తెలిపారు. భారత ప్రభుత్వం ×అఖండ భారత్≋ కార్యక్రమాన్ని ఢిల్లీలో నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. ఇందుకోసం వివిధ దేశాల ప్రతినిధులకు ఆహ్వానాలు కూడా వెళ్లాయన్నారు. ఐఎండీ 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రప్రథమంగా ఈ ఏడాది రిపబ్లిక్ డేకు వాతావరణ శాఖ ప్రత్యేక శకటం ప్రదర్శించనున్నట్టు తెలిపారు. ఈ ఓపెన్ హౌస్‌లో వెదర్ ఇన్‌స్ట్రుమెంట్స్ ప్రదర్శించి, వాటివల్ల కలిగే ఉపయోగాలను వాతావరణ శాఖ ఉద్యోగులు తెలియజేస్తారని చెప్పారు. కాకినాడ, పరిసర ప్రాంత విద్యార్థులు, ప్రజలు ఈ ఓపెన్ హౌస్‌ను సందర్శించి వాతావరణ శాఖ, దాని విశిష్టతను తెలుసుకుని విద్యార్థులకు వివరించాలని రాంబాబు కోరారు. అధిక సంఖ్యలో సందర్శకులు పాల్గొని 150 ఏళ్ల వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

ఆఫర్లతో ఆకట్టుకుంటూ..

- పండగకు కొనుగోలుదారులను ఆకర్షిస్తున్న దుకాణాలు
- మెయిన్ రోడ్డులో తప్పని ట్రాఫిక్ కష్టాలు



మెయిన్ రోడ్డుపై వాహనాల పార్కింగ్

బోట్‌క్లబ్: ఈ ఏడాది సంక్రాంతి కళ తప్పింది. అమ్మకాలు పెంచుకునేందుకు వ్యాపారులు ఆఫర్ల అస్త్రం వాడితేనే అమ్మకాలు సాగే పరిస్థితి వచ్చింది. చివరికి ఈ ఆఫర్ల కారణంగా కాకినాడ నగరంలో దుస్తులు కొనుగోలు చేసేందుకు ప్రజలు రావడంతో ఏ వస్త్ర దుకాణం చూసినా కిక్కిరిసిపోయింది. ఇక సంక్రాంతికి తమ సొంత ఊళ్లకు వెళ్లేందుకు పయనమవ్వడంతో కాకినాడ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. ఆదివారం ఉదయం వస్త్ర, ఫ్యాన్సీ, చెప్పుల దుకాణాల్లో అంతంత మాత్రంగా వ్యాపారం ఉండగా, సాయంత్రానికి కాస్త రద్దీగా మారాయి. దీంతో మెయిన్ రోడ్డు, భానుగుడి సెంటర్, మసీద్ సెంటర్, బాలాజీ చెరువు సెంటర్, దేవాలయం వీధి, సినిమా రోడ్డులోని వ్యాపార ప్రాంతాలన్నీ కిక్కిరిశాయి. నగరంలో ఏ వీధి చూసినా వాహనాలు బారులు తీరాయి. సామాన్యులు మార్కెట్‌గా పేరొందిన సంత చెరువు జనసంద్రాన్ని తలపించింది. మార్కెట్‌లోకి వెళ్లేందుకు దారికూడా లేని పరిస్థితి నెలకొంది. నడిచి వెళ్లేందుకు సైతం ఖాళీ లేకుండా కొనుగోలుదారులతో ఉంది.

వాహనాలతో పాట్లు

మార్కెట్‌కు వచ్చిన పలువురు తమ వాహనాలను రోడ్డు మధ్యలో పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్యలు నెలకొన్నాయి. మెయిన్‌రోడ్డు, దేవాలయం వీధిలో ట్రాఫిక్ కారణంగా ప్రయాణికులు పడరాని పాట్లు పడ్డారు. ఇక నగరంలో పలు మిఠాయి దుకాణాలు వద్ద సంక్రాంతి తినుబండారాలు తయారు చేసి విక్రయించారు. వీటిని ప్రజలు కొనుగోలు చేయడం కనిపించింది. మరికొందరు తమ బంధువులకు ఇచ్చేందుకు స్వీట్ ప్యాకెట్లు తయారు చేసుకోవడం కనిపించింది. స్వీట్ షాపులు ఎదురుగా ప్రత్యేక కౌంటర్లు పెట్టి మరీ సంక్రాంతి స్పెషల్ తినుబండారాలు పోకుండలు, అరిసెలు, సున్నుండలు, కజ్జికాయలు, జంతికలు వంటివి విక్రయించారు.



వస్త్ర దుకాణంలో దుస్తులు కొనుగోలు చేస్తున్న ప్రజలు



గాంధీనగర్ మార్కెట్ వద్ద విక్రయాలకు సిద్ధంగా ఉన్న భోగి పిడకలు

ఒకటి కొంటే.. మరొకటి ఉచితం

సంక్రాంతి వేళ వినియోగదారులను ఆకర్షించేందుకు దుకాణ యజమానులు రకారకాల ఆఫర్లు ఇచ్చి ఆకర్షించేందుకు ప్రయత్నించారు. వస్త్ర దుకాణాల్లో ఒక చీర కొంటే మరో చీర ఉచితం, వస్త్రాలు కొనుగోలు చేస్తే 10 నుంచి 30 శాతం తగ్గింపు వంటి ఆఫర్లతో వినియోగదారులను ఆకట్టుకుంటున్నారు. ఇక టీవీ, ఫ్రిజ్, వంటి గృహోపకరణ యజమానులు తమ కస్టమర్లను ఆకట్టుకొనేందుకు ఉచిత బహుమతులు, స్కాచ్ కార్డు వంటి ఆఫర్లు ప్రకటించారు. దీంతో వినియోగదారులు ఆఫర్లు సంక్రాంతి పోతే మళ్లీ రావని వాటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేస్తే కొన్ని వాహన కంపెనీలు రూ. 5 వేల వరకూ డిస్కౌంట్ ఇచ్చాయి. మరికొన్ని కంపెనీలు ఇన్సూరెన్స్ ఉచితం వంటి ఆఫర్లు ఇచ్చారు. సంక్రాంతి వేళ కొత్త వాహనాలు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపడంతో ప్రత్యేక ఆఫర్లు ఇచ్చారు.

భోగి పిడకల విక్రయం

కాకినాడ నగరంలో భోగి పిడకలు ప్రతి సెంటర్‌లో విక్రయించారు. దండ ఒక్కొక్కటీ రూ. 60 నుంచి 80 వరకూ అమ్మారు. సోమవారం జరిగే భోగి పండగ రోజున మంటలో పిడకలు వేసేందుకు ప్రజలు వీటిని కొనుగోలు చేశారు. గత ఏడాదితో పోలిస్తే అమ్మకాలు మందగించాయి.

పేదలకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న అడబాల ట్రస్ట్ ప్రతినిధులు రత్నప్రసాద్, బాపిరాజు

కాకినాడ రూరల్: రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విశ్రాంత తహసీల్దార్ రేలంగి బాపిరాజు మాట్లాడుతూ మన సంస్కృతీ సంప్రదాయాలకు పండగలు నిదర్శనమని, కుటుంబ సభ్యులంతా ఆనందించడమే పండగ పరమార్థమన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని పేద మహిళలకు వస్త్రాలు సమకూర్చిన అడబాల ట్రస్ట్ సేవలు అభినందనీయమని బాపిరాజు తెలిపారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, ప్రసాద్ నాయుడు, రాజా తదితరులు పాల్గొన్నారు.

15న హాకీ క్రీడాకారుల ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా హాకీ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15న సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో హాకీ క్రీడాకారుల ఎంపికలు జరుగుతాయని సంఘ కార్యదర్శి నంబు శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. స్థానిక జిల్లా క్రీడా మైదానంలోని హాకీ కోర్టులో ఈ ఎంపికలు ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. దీనికి 2009 జనవరి 1 తర్వాత పుట్టిన వారు అర్హులన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 17 నుంచి 19 వరకూ చిత్తూరు జిల్లా మదనపల్లిలో జరిగే అంతర్ జిల్లాల సబ్ జూనియర్స్ హాకీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గలవారు ఎంపికలకు హాజరుకావాలని హాకీ కోచ్ రవిరాజు కోరారు.

మహోన్నతుడు స్వామి వివేకానంద

జిల్లా కలెక్టర్ షణ్మోహన్



అండర్–14 క్రికెట్ జట్టుకు ఎంపికైన రేవంత్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు



కాకినాడలో వివేకానందుని విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నతుడు స్వామి వివేకానంద అని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని రామకృష్ణ మిషన్, జిల్లా యువజన సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం వేడుకలు జరిగాయి. కాకినాడ రాజా ట్యాంకు వివేకానంద పార్కులోని వివేకానందుని విగ్రహానికి శాసనమండలి సభ్యులు కర్రి పద్మశ్రీ, కలెక్టర్ షణ్మోహన్ ఇతర అధికారులతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మ విశ్వాసం ఉంటే ఎంతటి కార్యమైనా సాధించవచ్చని, పిరికితనం విజయానికి దూరం చేస్తుందన్నారు. మనలోని ఆత్మ విశ్వాసమే విజయ తీరాల వైపు నడిపిస్తుందని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. వివేకానందుని బోధనలు స్ఫూర్తి మంత్రాలుగా నిలిచి యువతలో చైతన్యాన్ని నింపుతాయన్నారు. చికాగోలో జరిగిన సర్వమత సమ్మేళన సభలో ఆయన చేసిన అనితర సాధ్యమైన ప్రసంగం గుర్తుకు తెచ్చుకుంటే ఎన్నో ఆశ్చర్యకరమైన విషయాలు తెలుసుకోవచ్చన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ స్వామి వివేకానంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఆత్మ విశ్వాసంతో యువత ముందడుగు వేయాలని సూచించారు. యువజన సంక్షేమ శాఖ సీఈఓ కేఎస్వీ కాశీ విశ్వేశ్వరరావు, రామకృష్ణ సేవా సమితి ప్రెసిడెంట్ వీఎల్ గాంధీ, వైస్ ప్రెసిడెంట్ వి.రామకృష్ణ, సెక్రటరీ కె.శర్మ, కె.రామకృష్ణ, వివిధ యువజన సంఘాల ప్రతినిధులు, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం

కాకినాడ రూరల్: యువతకు స్వామి వివేకానందుడు ఆదర్శమని సెట్రాజ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కేఎస్‌వీ కాశీ విశ్వేశ్వరరావు తెలిపారు. స్థానిక యువజన సర్వీసుల శాఖ, సెట్రాజ్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవాన్ని వివేకానంద పార్క్‌లో నిర్వహించారు. దీనికి కాకినాడ ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎ.రమణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సెట్రాజ్ సీఈఓతో కలసి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ గొప్పదనాన్ని, ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు తెలియజేశారన్నారు. సెట్రాజ్, ఏపీఐఐసీ, ఖాదీబోర్డు, నెహ్రూ యువ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కరప: స్వామి వివేకానంద తన బోధనలతో యావత్ ప్రపంచానికి స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ బొండా సూర్యారావు అన్నారు. వివేకానంద జయంతి సందర్భంగా స్థానిక నక్కా సూర్యనారాయణ మూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో వివేకానందుని విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకుడు సాదే లోహిదాస్‌తో కలసి ఆయన పూలమాల వేశారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడల్లో పాల్గొనేందుకు అండర్–14 రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఎంపికైన అడపా రేవంత్‌ను పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు సత్కరించారు. వైస్ ఎంపీపీ పాట్నీడి సత్యభీమేశ్వరరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నక్కా వీరభద్రరావు, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, నక్కా సత్తిబాబు, దేవు వెంకటేశ్వరరావు, శాకా శ్రీనివాస్, అడపా శ్రీను, బోడపునీడి వెంకటరమణ పాల్గొన్నారు.



వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ రమణారెడ్డి, సెట్రాజ్ సీఈఓ విశ్వేశ్వరరావు

శ్రీనివాసా.. శ్రీవేంకటేశా



శేషసాయి అవతారంలో వేణుగోపాలస్వామి


కాకినాడ రూరల్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సర్పవరం జంక్షన్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు భక్తులకు విశ్వరూప దర్శనమిచ్చారు. స్వామివారిని రోజుకొక అవతారంలో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తున్నారు. ఆదివారం విశ్వరూప దర్శనంలో స్వామిని అధిక సంఖ్యలో భక్తులు కొలిచారు.

విశ్వరూప అలంకరణలో సీతారామస్వామి

బోట్‌క్లబ్: ధనుర్మాస వ్రతమహోత్సవాలు, రజిత దశవతార అలంకార ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి విశ్వరూప సందర్శనం ఆకట్టుకుంది. అలాగే దేవాలయం వీధిలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామివారు శేషసాయి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి ఉదయం అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారికి భక్తులు తరలివచ్చి పూజలు చేశారు.

నేడు ధాన్యాభిషేకం

స్థానిక సూర్యారావుపేటలోని దూసర్లపూడి వారి వీధిలో స్వయం భూ భోగి గణపతి పీఠంలో భోగి పండగ సందర్భంగా సోమవారం ధాన్యాభిషేకం నిర్వహిస్తున్నట్లు పీఠం ఉత్సవ నిర్వాహకులు సూర్యనారాయణరాజు, రమాదేవి దంపతులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా మహాన్నదానం ఉంటుందన్నారు. గోవు పిడకలతో హోమ యజ్ఞం, బాలలకు భోగి పండ్లు పోసి ఆశీర్వచనం, సంక్రాంతి రోజు శబరిమల అయ్యప్పస్వామి వారికి పడి హారతి జరుగుతాయన్నారు. భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.



విశ్వరూప దర్శనంలో వేంకటేశ్వరుడు



విశ్వరూప అలంకరణలో సీతారామస్వామి

అయోధ్య బాలరాముని ప్రాణప్రతిష్ఠ

అయోధ్య బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పరిషత్ అధ్యక్షుడు రాజమహంతి రవిశంకర్ పట్నాయక్ తెలిపారు. స్థానికంగా వివిధ రామాలయాల్లో ప్రాణప్రతిష్ఠ వార్షికోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువుల ఐక్యతగా ఉంటే సాధించలేనిది ఏమీ లేదన్నారు. విజయవాడలో హైందవ శంఖారావం విజయవంతానికి కృషి చేసిన రామాలయ కమిటీలకు ధన్యవాదాలు తెలిపారు. సూర్యనారాయణపురంలో వివిధ రామాలయాలు, రామకృష్ణారావుపేట, గాంధీనగర్‌లోని వివిధ రామాలయాలను సందర్శించి శ్రీరామ విజయ మహా మంత్రం జపిస్తూ, భజనలు చేసి, సామూహిక దీపాలు వెలిగించారు. జిల్లాలో మూడు రోజుల పాటు ఈ వేడుకలు పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పరిషత్ సభ్యులు ఉదయభానోజీరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో భోగి గణపతి



సూర్యనారాయణపురంలో అయోధ్య బాలరాముని ప్రాణప్రతిష్ఠ వేడుకలు నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

రారండోయ్.. సందడి చేద్దాం

- నేడు భోగి పండగ
- ప్రతి ఇంటా ఆకట్టుకుంటున్న రంగవల్లులు
- గ్రామాల్లో ఇంటింటికీ హరిదాసులు



డూడూ బసవన్నల సందడి

కరప: పెద్ద పండగ రానే వచ్చింది.. భోగితో ఆహ్వానం పలికింది.. కరప మండలంలోని అన్ని గ్రామాల్లో భోగి పండగ సందడి వచ్చింది. హరిదాసు సంకీర్తనలతో పల్లె వాసులను మేలుకొలుపుతోంది.. మహిళలు ప్రతి ఇంటా రంగవల్లులు తీర్చిదిద్దుతున్నారు. విద్యాలయాలకు సంక్రాంతి సెలవులు కావడంతో యువతీ, యువకులు ఆటపాటలతో కేరింతలు కొడుతున్నారు. కొన్ని గ్రామాల్లో క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహిస్తున్నారు. సంక్రాంతి పండగ అంటే గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో మక్కువ. రైతు కుటుంబాలు ఎక్కువగా ఉండే పల్లెల్లో ఈనెలలోనే తొలకరి పంట చేతికొస్తుంది. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకూ ఈ పండగ కోసమే ఎదురు చూస్తుంటారు. భోగి పండగ రావడంతో మహిళలు పోటాపోటీగా ఇంటి ముంగిట కల్లాపు చల్లి వివిధ రకాల ముగ్గులతో పాటు నెలవంక ముగ్గులను తీర్చిదిద్దుతారు. పండగ నాలుగు రోజులూ వేడుకగా జరుపుకోవడం సంప్రదాయంగా వస్తోంది. తొలి పండగ భోగి సోమవారం జరగనుంది. తెల్లవారు జామునే యువకులు, పెద్దలు కలసి వీధివీధిన భోగి మంటలు వేసేందుకు సిద్ధమయ్యారు. ఆవు పేడతో తయారు చేసిన భోగి దండలను మంటల్లో వేసేందుకు పిల్లల ఉత్సుకత చూపుతున్నారు. భోగి రోజు ఉదయాన్నే తలస్నానం చేసి కొత్త దుస్తులు ధరించి భోగి దండలను మంటలో వేసి భక్తితో నమస్కరించడం పల్లె ప్రజల ఆచారం. అదేరోజున ఇరుగు పొరుగు వారిని, పేరంటాళ్లను పిలిచి తమ ఇంటా చిన్నారులకు పెద్దలతో రేగిపండ్లను పోయించి ఆశీర్వాదం పొందుతారు. సంక్రాంతి రోజున ప్రతి ఒక్కరూ తమ పెద్దలను తలచుకుని వారి పేరుతో పేదలకు దుస్తులు, అటుకులు, పండ్లు సమర్పించి వారి ఆశీర్వాదం తీసుకుంటారు. కనుమ రోజున ప్రతిఒక్కరూ భక్తితో తలస్నానం చేస్తారు. రైతులు తమ ఇంటి వద్ద పశువుల పేడను గుట్టగా చేసి, నైవేద్యం పెట్టి, పూజలు చేస్తారు. ముక్కనుమ రోజున దేవతలకు నైవేద్యాలు సమర్పిస్తారు. అదేరోజున మహిళలు బొమ్మల నోమును ఆచరిస్తారు. యువకులు గాలిపటాలను పోటాపోటీగా ఎగురవేసి ఉత్సాహంగా గడుపుతారు.

కోడి పందేలకు సై

గ్రామాల్లో కోడి పందేలకు బరులు సిద్ధం చేశారు. కోడి పందేలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచిస్తుంటే, ఎలాగైనా నిర్వహించేందుకు నిర్వాహకులు ముందుకు సాగుతున్నారు. ఈ జూద క్రీడలో రూ.లక్షల్లో చేతులు మారనున్నాయి.



ఇంటింటికీ వెళ్తున్న హరిదాసు



పందెంలో తలపడుతున్న కోళ్లు (ఫైల్)

ముగ్గులు వేసి.. సందడి చేసి

ఆఖరి పండగ రోజున మహిళలు రథం ముగ్గు వేసి భోగి మంటలోకి కలుపుతారు. దీనివల్ల కీడు పోయి మంచి జరుగుతుందని మహిళల నమ్మకం. కొన్ని గ్రామాల్లో ఎడ్ల బళ్ల పరుగు పోటీలు, క్రికెట్, కబడ్డీ, ఖోఖో వంటి పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేస్తున్నారు.

ఆనందం నింపేందుకు సేవలు

బోట్‌క్లబ్: నిరుపేద కుటుంబాల్లో పండగ వేళ ఆనందం నింపేందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఖమ్మంకు చెందిన గ్రేస్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు ఎం.జాకబ్ అన్నారు. ఆదివారం స్థానిక ఐదు కాలనీల్లో 2,300 కుష్టు వ్యాధిగ్రస్తులకు దుస్తులు, నిత్యావసర సరకులు, బెడ్ షీట్లు అందించారు. సంస్థ అందించిన సేవలను వీరంరెడ్డి శ్రీనివాసరావు అభినందించారు. సంక్రాంతి పండగను నిరుపేదలు సంతోషంగా జరుపుకోవాలని భారీ ఎత్తున సహాయం చేయడం అభినందనీయమన్నారు. సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కుష్టు వ్యాధిగ్రస్తులకు దుస్తులు, నిత్యావసరాలు అందిస్తున్న గ్రేస్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు జాకబ్

మానవతా విలువలు పెంపొందించుకోవాలి

పెద్దాపురం: చిన్న వయసు నుంచే మానవతా విలువలు పెంపొందించుకోవాలని, దీనికి విధిగా సత్యసాయి బాల వికాస్ తరగతులకు చిన్నారులు రావాలని శ్రీసత్యసాయి సేవా సంస్థల కాకినాడ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజులు అన్నారు. వడ్లమూరు సత్యసాయి మందిరంలో ఆదివారం సేవా సమితి కన్వీనర్ చల్లా సాయిరామ్ అధ్యక్షతన సత్యసాయి శత జయంతి ఉత్సవాలు, సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరాజులు మాట్లాడుతూ విద్యతో పాటు సంస్కారాన్ని పెంపొందించుకోవాలన్నారు. స్థానిక సేవాదళ్ కో ఆర్డినేటర్ వై.వీరభద్రరావు మాట్లాడుతూ 2007లో భీష్మ ఏకాదశి సందర్భంగా మందిర శంకుస్థాపన సందర్భంలో కొబ్బరికాయ నుంచి సత్యసాయి విగ్రహం రావడం, బాబా అనుగ్రహంతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ వైస్ చైర్మన్ ఎన్.శ్రీనివాస్, సేవాదళ్ సమన్వయకర్త పాలచర్ల శ్రీనివాస్, మహిళా సమన్వయకర్త రాధిక, నాగేశ్వరరావు, ఎల్.శ్రీనివాసరాజు, మధుశ్రీ, సాయిలక్ష్మి, దొడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న గోవిందరాజులు